# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 18, మే 2026


# శాంతిభద్రతలకు ప్రజల సహకారం అవసరం

- కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి
- 'పోలీసులు మీకోసం'తో మానవత్వం చాటిన కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు
- మాలిని గ్రామంలో 200 మంది గ్రామస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ



**కాగజ్‌నగర్ రూరల్, మే 17, ప్రభాతవార్త**



"పోలీసులు మీకోసం"తో కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో రాబిన్ హుడ్ ఆర్మీ ఇంటర్నేషనల్ ఎన్జీవో సహకారంతో నిర్వహిస్తున్న "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలిని గ్రామంలో 200 మంది గ్రామస్తులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి పాల్గొని గ్రామస్తులకు ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం, 2 కిలోల గోధుమపిండి, 2 కిలోల పప్పు, 1 కిలో ఉప్పు మరియు మిర్చి పౌడర్‌ను అందజేశారు. గ్రామ ప్రజలు పోలీసుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన సీఐ కుమారస్వామి, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు గ్రామస్తులు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు మంచి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్, పెంచికల్పేట్ ఎస్సై అనిల్ కుమార్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### విధుల్లో నిబంధనలు పాటించని

# పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

**ఆసిఫాబాద్, మే 17, ప్రభాతవార్త :**



విధుల్లో నిబంధనలు పాటించని పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దహేగాం మండలం బిబ్రా గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్ లు కార్యదర్శిపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేసిన విచారణలో పంచాయతీ కార్యదర్శి డి.సుమలత గ్రామపంచాయతీ తీర్మానం, సర్పంచ్, ఉపసర్పంచ్ ఆమోదం లేకుండా 1,02,297 రూపాయల నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారని, ఇతర చెల్లింపులలో నిబంధనలు పాటించలేదని తేలడంతో సదరు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతిలో నిధులు చెల్లింపు పారదర్శకంగా చేయాలని, నిబంధనలు అతిక్రమించినా, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# మట్టె రవీందర్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ మెమోరియల్ అవార్డు

- మందమర్రికి మరోసారి సాహిత్య గౌరవం



**మందమర్రి, మే 17, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణానికి చెందిన మట్టె రవీందర్ ప్రతిష్టాత్మక రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ లిటరసీ ఎక్స్‌లెన్స్ అవార్డు–2026కు ఎంపికై పట్టణానికి మరోసారి గౌరవం తీసుకొచ్చారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీలో ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దుగ్గెలి నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరుకాగా, కేవీఎస్ విద్యాసంస్థల అధినేత కేవీఎస్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 70 మంది ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 13 మందిని మాత్రమే ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహిత్య, విద్యా రంగాల్లో విశేష సేవలు అందించినందుకు మట్టె రవీందర్ ఈ అవార్డుకు మిగతా 2లో..

### వరి ధాన్యం కొనుగోలు

# ప్రక్రియ వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, మే 17, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట, నమ్నూర్, దొనబండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం మిగతా 2లో..



### రైలు కిందపడి

# కానిస్టేబుల్ ఆత్మహత్య

### మానసిక ఒత్తిడే కారణమా...?



**మందమర్రి, మే 17, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని ఎర్రగుంటపల్లికి చెందిన సివిల్ కానిస్టేబుల్ రేండ్ల అరవింద్ యాదవ్ (31) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రేండ్ల అరవింద్ యాదవ్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్‌లో 2020 బ్యాచ్‌కు చెందిన పీసీ 3905గా విధులు నిర్వహిస్తున్నాడు. అతను గత మార్చి 26 నుంచి సస్పెన్షన్‌లో ఉన్నట్లు సమాచారం. అప్పటి నుంచి మందమర్రి ఎర్రగుంటపల్లిలోని తన స్వగృహంలో తల్లి, చెల్లెలుతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం రాత్రి సుమారు 8.50 గంటల మిగతా 2లో..

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని,ఒక రోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియ అనుసంధానంగా జరగాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి కానిస్టేబుల్ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో మందమర్రి రామన్ కాలనీ ఫ్లైవర్ బ్రిడ్జి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సస్పెన్షన్‌కు గురైనప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి లోనై డిప్రెషన్‌లో ఉన్న అరవింద్ యాదవ్, మానసిక ఒత్తిడితో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు, స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న మంచిర్యాల ప్రభుత్వ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు. ఘటనతో ఎర్రగుంటపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మట్టె రవీందర్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ మెమోరియల్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

ఎంపికైనట్లు పేర్కొన్నారు. అవార్డు అందుకున్న రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవం అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత కృషి చేసి సాహిత్య రంగంలో సేవలందిస్తానని అన్నారు. కార్యక్రమంలో తెలుగు భాష సేవకులు జేఎస్ఆర్కే శర్మ, ముద్దరి శంకరప్ప, రాయపాటి నాగలక్ష్మి, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ రాహుల్, డాక్టర్ రమేష్, హరికృష్ణ, అవార్డు గ్రహీతలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణపై నేడు మాక్ ఎక్సర్‌సైజ్

**కాగజ్‌నగర్, మే 17, ప్రభాతవార్త :**

అటవీ అగ్నిప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలు, విభాగాల సమన్వయాన్ని పరీక్షించేందుకు సోమవారం వేంపల్లి అడవుల్లో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ విన్యాసాల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలపై ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సోమవారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.కేబీ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ విన్యాసాల్లో అటవీ, అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, పశువైద్య, ఆరోగ్య తదితర శాఖలు పాల్గొననున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని నియంత్రణ పద్ధతులు, ప్రజల రక్షణ చర్యలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. కేబీ ఆసిఫాబాద్ డీఎఫ్‌వో మార్గదర్శకత్వంలో అటవీ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోందని, అన్ని శాఖలు మాక్ ఎక్సర్‌సైజ్‌కు సిద్ధమయ్యాయని కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి తెలిపారు.

## కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ

**సారంగాపూర్, మే 17, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యారంగంలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన అందిస్తోందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ఐఐటీ, నీట్ మొదలగు పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పిస్తోందని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం ప్రవేశపెడుతోందని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించి ఉన్నతమైన విద్యను అందించి, ఇంజనీరింగ్, మెడికల్ రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకునేలా చూడాలని కోరారు. విద్యార్థుల అభివృద్ధికి కావలసిన అన్ని రకాలుగా ప్రభుత్వం విద్యాబోధన చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన ప్రజాపాలన విద్యా వారోత్సవాలు

### - యోగ నుంచి ఏఐ అవేర్‌నెస్ వరకు విద్యార్థుల్లో నూతన చైతన్యం

**కాగజ్‌నగర్ రూరల్, మే 17, ప్రభాతవార్త :**




ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో 7వ రోజు, చివరి రోజు ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 11 నుండి 17వరకు ఏడు రోజుల పాటు నిర్వహించిన విద్యా వారోత్సవాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా యోగ, లైబ్రరీ పుస్తక ప్రదర్శన, కళాశాలలోని వివిధ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల ఫ్లెక్సీల ప్రదర్శన, ఆన్‌లైన్ ఏఐ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీయం జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు అనేక విషయాలు నేర్చుకోవడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే కళాశాల అభివృద్ధికి సిర్పూర్ పేపర్ మిల్స్ తరపున తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ వారం రోజులుగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాయని తెలిపారు. కళాశాల అభివృద్ధికి సిర్పూర్ పేపర్ మిల్స్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన శీరీన్ డిగ్రీ కళాశాల స్థాపనలో సిర్పూర్ పేపర్ మిల్స్ అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కూడా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శారద, ముంజం రాజేశ్వర్, దేవేందర్, వెంకటేశ్వర్లు, రోజ్ మేరీ, కృష్ణవేణి, ఇతర టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయండి

### - అధికారులను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**చెన్నూరు, మే 17, ప్రభాతవార్త**

కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాములు అధికారులకు సూచించారు. ఆదివారం జిల్లాలోని కోటపల్లి, చెన్నూరు మండలాలలోని ఏఎంసి గోదాములు, జైపూర్ మండలం రామారావుపేట లోని సుముఖ గోదామును అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా గోదాములకు తరలించడం జరుగుతుందని, గోదాములకు తరలించబడిన ధాన్యాన్ని వేగవంతంగా దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. వరి ధాన్యం దిగుమతిని త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండలం శంకర్ పూర్ లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ రాఘవేంద్ర, సి.ఇ. లతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతూ రైతులుతేమ శాతం చూసుకొని, తాలు, తప్ప, ఎలాంటి మట్టి గడ్డలు లేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ చేయూత

### - రామటేంకి ఆపిల్ పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర వస్తువుల పంపిణీ

**మందమర్రి, మే 17, ప్రభాతవార్త**

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రామటేంకి ఆపిల్ పుట్టినరోజు సందర్భంగా మందమర్రి పట్టణంలోని ఒర్రగడ్డ ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద దంపతులు శోభాదేవి కుటుంబానికి ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్ మాట్లాడుతూ వృద్ధాప్యంతో పాటు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శోభాదేవి కుటుంబ పరిస్థితిని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సమాచారం అందిన వెంటనే స్పందించి కుటుంబానికి అవసరమైన బియ్యం, కిరాణా సరుకులు తదితర నిత్యావసర వస్తువులను అందజేశామని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ కుటుంబానికి సొసైటీ తరఫున సహాయం అందించామని, భవిష్యత్తులోనూ తమ వంతు అండదండలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, అవసరాల్లో ఉన్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు చేయూతనందించడం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన రూన్సీ కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ సంస్థ ప్రతినిధులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నాదిపాటి రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, ఎండీ జావిద్ పాషా, శ్రీనివాస్, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్న శ్రీవర్షిని

### - విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా నగదు పురస్కారం

### - అభినందించిన అస్నాద్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం

**చెన్నూరు, మే 17, ప్రభాతవార్త**



చెన్నూరు మండలంలోని అస్నాద్ గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుడిమల్ల శ్రీవర్షిని జాతీయ స్థాయిలో వాలీబాల్ క్రీడలో రాణించినందుకు గాను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా పదివేల రూపాయల నగదు పురస్కారం అందుకుంది. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక లో భాగంగా మే 11 నుంచి మే 17 వరకు జరిగిన విద్యా వారోత్సవాల సందర్భంగా వాలీబాల్ ఆటలో రెండుసార్లు జాతీయస్థాయిలో అవార్డు పొందినందుకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య చేతుల మీదుగా 10వేల రూపాయల బహుమతి, మోమెంటోతో పాటు ప్రశంసాపత్రం వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో అందుకున్నట్లు ఉపాధ్యాయ బృందం తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడల్లోనూ రాణించేవిధంగా తయారు చేస్తున్నామని, శ్రీవర్షినికి అభినందనలు తెలియజేస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. మా బిడ్డ చదువుతో పాటు, క్రీడల్లో రాణించడం మాకు గర్వంగా ఉందని, తల్లిదండ్రులు గుడిమల్ల సారక్క,మల్లయ్య ఆనందం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ కమిటీల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

### - ఆశావహులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మందమర్రి, మే 17, ప్రభాతవార్త**



కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల కమిటీల నియామకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మందమర్రి పట్టణంలో ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాలు, వార్డు అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, పట్టణ ఇన్‌చార్జ్ గోపతి భానేష్, డీసీసీ కార్యదర్శి ఆకారం రమేష్, సొతుకు సుదర్శన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బి1 క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మొదటి రోజు ఆదివారం ముగిసిందని తెలిపారు. ఆశావహుల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. రేపు సోమవారం రోజున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలనే ఆసక్తి, సేవాభావం ఉన్న నాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట, మే 17, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం లక్షెట్టిపేట మండలం గుల్లకోటలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని అన్నారు. అనంతరం మిట్టపల్లి, లక్ష్మీపూర్‌లలో గల రైస్ మిల్లులను మండల తహసీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియ పరిశీలించారు. రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వేసవి అయినందున వడదెబ్బకు గురికాకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలతో మాట్లాడి ఆసుపత్రిలో కల్పించిన సౌకర్యాలు, అందిస్తున్న వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పిటిసి

**వేమనపల్లి, మే 17, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని జక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పిర్సింగుల కమలాకర్ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి ఆర్ సంతోష్ కుమార్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి మధు, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, సయ్యద్ సాబీర్ అలీ, ఒడేల రాజన్న, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన సర్పంచ్ సాహెబ్‌రావు

**సారంగాపూర్, మే 17, ప్రభాతవార్త:**



మండలంలోని కంకేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాహెబ్ రావు, ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులను సర్పంచ్ అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్ ప్రథమ విద్యార్థి భార్గవికి 2500 రూపాయలు, ద్వితీయ విద్యార్థి ప్రవళికకు 1500 రూపాయలు, తృతీయ విద్యార్థి మనీష్‌కు 1000 రూపాయల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణానికి సహకరిస్తా: ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 17, ప్రభాతవర్త:**

నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న నూతన రామాలయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. తేజాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు ఆదివారం ఆడే గజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన రామాలయ మందిరం అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే రామాలయ మందిరం వద్ద 10 లక్షల రూపాయల వ్యయంతో మండపం నిర్మాణం చేపట్టి, త్వరలోనే భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు ఆడే గజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్



## హంపోలి గ్రామంలో చెరువు మరమ్మతుల పనులకు శ్రీకారం

**భైంసా, మే 17, ప్రభాతవార్త:**

కుబీర్ మండలంలోని హంపోలి గ్రామంలో 39.50 లక్షల రూపాయల ఇరిగేషన్ నిధులతో చేపట్టనున్న చెరువు మరమ్మత్తుల పనులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో చెరువుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా పంట సాగు, వ్యవసాయ అవసరాల కోసం చెరువులు గ్రామాలకు జీవనాధారమని పేర్కొన్నారు. చెరువులు నిండుగా ఉండడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి మట్టాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఏకమై చెరువులను పరిరక్షించుకోవాలని, చెరువుల ఆక్రమణలు, కాలుష్యాన్ని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపడేలా ప్రత్యేక దృష్టితో పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. చెరువు మరమ్మత్తుల పనులు పూర్తయితే సాగునీటి సమస్యలు తగ్గడంతో పాటు పంటల ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై ఎంఐఎం తప్పుడు ఆరోపణలు చేస్తోంది: బాలాజీ సూత్రావే

**భైంసా, మే 17, ప్రభాతవార్త:**



భైంసా పట్టణ ప్రజల తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ముథోల్ శాసనసభ్యుడిపై ఎంఐఎం నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తిప్పికొట్టాలని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షులు బాలాజీ సూత్రావే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భైంసా పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న మత ఘర్షణల సమస్యలకు శాశ్వత పరిష్కారం వెతికి, ఎంఐఎం ఆగడాలకు అడ్డుకట్ట వేయడం జరిగిందన్నారు. ప్రజల తీర్పు మేరకు భైంసా మున్సిపాలిటీలో జనతా సర్కార్ ఏర్పాటు కావడం జరిగిందని, దీనిని జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమాజంలో గొడవలు సృష్టించి, ప్రజలను విడదీసి పాలించాలనే కుట్రలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. వారి తప్పుడు ప్రచారాల వలలో పడకుండా, జరుగుతున్న రాజకీయ దాడులపై మనమందరం కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంతా ఒక్కటై ధీటుగా ఎదుర్కొన్నప్పుడే విజయం సాధ్యమవుతుందని బాలాజీ సూత్రావే స్పష్టం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తాం: సబ్ కలెక్టర్ మనోజ్

**వేమనపల్లి, మే 17, ప్రభాతవార్త**

నీల్వాయి మొక్కజొన్న కేంద్రాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు సబ్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే రెండు లారీలను పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ కార్యదర్శి రాజు నాయక్, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**భైంసా, మే 17, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ మండలం ఎడబిడ్ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కోద్దు కర్ణాకర్‌కు సుమారు 44 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ముధోల్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ భోస్లే నారాయణరావు పటేల్ ఆదివారం పంపిణీ చేశారు. చెక్కును మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముధోల్ మండల అధ్యక్షుడు గంగారెడ్డి, శ్యామ్‌రావు పటేల్, అటల్ దేవిదాస్, మాధవ్‌రావు పటేల్, షేక్ సాజిద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

